RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 292 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 28-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥

VOLUME: 18 | ISSUE : 292 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 28-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS



## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్..

## శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

**రూ.18.55 కోట్ల వ్యయంతో 5.90 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం**

**రిటైల్, హోల్ సేల్ స్టాళ్లు, కోల్డ్ స్టోరేజీతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్**

**మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా ఈ నిర్మాణం**



**మంగళగిరి, సిటిజన్ టైమ్స్**

మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరో కీలక ముందడుగు వేశారు. మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ సమీపంలో రూ.18.55 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక 'మోడరన్ రైతు బజార్' నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. సుమారు 5.90 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించనున్నారు. అరబిందో తరువాయి 2లో..

## యూపీఐకి 10 ఏళ్లు..

## మోదీకి చంద్రబాబు అభినందనలు

**యూపీఐపై ప్రధాని మోదీకి మద్దతు తెలిపిన సీఎం చంద్రబాబు**

**సామాన్యుడి దైనందిన లావాదేవీలను యూపీఐ మార్చేసిందన్న సీఎం**

**చిరు వ్యాపారులు, మహిళలకు చెల్లింపులు సులభతరం చేసిందని వెల్లడి**

**భారత టెక్నాలజీ సామర్థ్యానికి యూపీఐ నిదర్శనమని కితాబు**



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వ్యవస్థ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. భారతదేశ డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ ఒక అద్భుతమైన మైలురాయి అని, సామాన్యుడి జీవితంలో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని ఆయన కొనియాడారు. ఈ మేరకు ప్రధాని మోదీ తరువాయి 2లో..

## 800 మంది గల్లంతు.. వారిలో 300 మంది భారతీయులు: నేపాల్ మంత్రి



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది. నేపాల్‌లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు తరువాయి 2లో..




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

తపాలా శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. దేశ వ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) పోస్టుల భర్తీకి ఈ నెలాఖరు నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. అర్హులైన, ఆసక్తికలిగిన అభ్యర్థులు ఎవరైనా ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 19వరకు ఆన్‌లైన్ ఓటీఆర్ చేసుకొనేందుకు పోస్టల్ శాఖ అధికారులు అవకాశం కల్పించారు. అలాగే, సెప్టెంబర్ 2 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 23, 24 తేదీల్లో దరఖాస్తుల్లో పొరపాట్లు సవరించుకోవచ్చు. దరఖాస్తు రుసుం రూ.100. మహిళలు, ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులకు దరఖాస్తు రుసుం నుంచి మినహాయింపు ఇచ్చారు.

**పరీక్ష లేదు.. వేతనం ఎంతంటే?**

బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ / డాక్‌సేవక్ పోస్టులకు ఎలాంటి రాత పరీక్ష ఉండదు. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఈ నియామకాలు చేపట్టనున్నట్టు తపాలా శాఖ అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష ఉండటం తప్పనిసరి. అలాగే,అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు సైకిల్ తొక్కడం రావాలి. ఆ ఉద్యోగాలను బట్టి బీపీఎంకు వేతన శ్రేణి రూ.12 వేలు -రూ.29,380; ఏబీపీఎం/డాక్ సేవక్‌కు రూ.10వేలు -24,470గా తరువాయి 2లో..

## తోబుట్టువులా ఆదరించిన పవన్ కళ్యాణ్

**గొల్లప్రోలు ఆడపడుచులకు రాఖీ కానుకగా పట్టుచీరలు**




**గొల్లప్రోలు, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 27**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ గొల్లప్రోలు పట్టణంలోని ఆడపడుచుల పట్ల తన సోదర ప్రేమను చాటుకున్నారు. పట్టణ పరిధిలో వితంతు పింఛను పొందుతున్న 20 నుంచి 45 ఏళ్ల లోపు వయసున్న 198 మంది మహిళలను తన సొంత తోబుట్టువులుగా భావించి, వారికి ప్రత్యేక రాఖీ కానుకగా పట్టుచీరలను పంపించారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తరువాయి 2లో..

## భారత్ నెత్తిన చైనా 'నీటి బాంబ్'..

## జాగ్రత్తగా లేకుంటే ఉత్పాతమే!

**60,000 మెగావాట్ల మెడోగ్ డ్యామ్ నిర్మిస్తున్న చైనా**

**భూకంప ప్రాంతంలో డ్యామ్ నిర్మాణంపై ఆందోళన**

**డ్యామ్‌ను 'వాటర్ బాంబ్'గా నిపుణులు అభివర్ణన**

**నీటి విడుదలతో ఈశాన్య భారత్‌కు వరద ముప్పు**

**సియాంగ్‌పై భారత్ 11,000 మెగావాట్ల ప్రాజెక్టు**




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

నేపాల్‌ను ఒక్కసారిగా ముంచెత్తిన వరదలు భారత్‌లోనూ ఆందోళన రేకెత్తిస్తున్నాయి. హిమాలయ ప్రాంతంలో చోటుచేసుకున్న విపత్తు నేపథ్యంలో చైనా నిర్మిస్తున్న భారీ మెడోగ్ డ్యామ్‌పై నిపుణులు హెచ్చరిస్తున్నారు. తరువాయి 2లో..

## ఏపీ, తెలంగాణ మధ్య ఉద్రిక్తత

**సాగర్ గేట్లు ఎత్తేందుకు ఏపీ యత్నం..**



**అడ్డుకున్న తెలంగాణ అధికారులు**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మరోసారి జల వివాదం రాజుకుంది. సాగర్ కుడికాల్వ గేట్లు ఎత్తి నీటిని తీసుకునేందుకు ఏపీ అధికారులు చేసిన ప్రయత్నాన్ని తెలంగాణ ఇంజనీర్లు అడ్డుకున్నారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే గేట్లు ఎలా తెరుస్తారంటూ అడ్డుకోవడంతో ఇరు రాష్ట్రాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బుధవారం తరువాయి 2లో..

## అమరావతి అసెంబ్లీ భవన నిర్మాణంపై ఉన్నతస్థాయి సమీక్ష..

## అధికారులకు స్పీకర్ కీలక ఆదేశాలు

**అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలని స్పీకర్ ఆదేశం**

**265 మంది ఎమ్మెల్యేలు, 110 మంది ఎమ్మెల్సీల కోసం ఏర్పాట్లు**



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో శాసనసభ భవన నిర్మాణాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని రెండో బ్లాక్‌లో భవన నిర్మాణ ప్రణాళికలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. తరువాయి 2లో..

# ప్రభుత్వ భూముల కబ్జాలను సహించేది లేదు..

## అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలి

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్,ఆగస్టు 27**

ఆనందపురం మండలం సొంట్యం గ్రామంలో సర్కారు భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై తెలుగుదేశం పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సొంట్యంలోని సర్వే నెంబర్ 123 లేఅవుట్ పరిధిలో విలువైన ప్రభుత్వ బంజరు భూమిని కొందరు వ్యక్తులు యథేచ్ఛగా ఆక్రమిస్తూ పునాదులు, ప్రహరీ గోడలు నిర్మిస్తుండటంపై టీడీపీ గ్రామ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కబ్జా పర్వానికి వెంటనే అడ్డుకట్ట వేసి, అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చివేయాలంటూ గ్రామ టీడీపీ జాయింట్ సెక్రటరీ నేతృత్వంలో స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసి గట్టిగా డిమాండ్ చేశారు. లేఅవుట్‌లో కొందరు వ్యక్తులు తమకు కేటాయించిన స్థలాల హద్దులను దాటి, ప్రభుత్వ బంజరు భూమిలోకి చొరబడి దర్జాగా కబ్జాలకు పాల్పడుతున్నారని టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. తాజాగా మరో వ్యక్తి తనకు కేటాయించిన స్థలానికి అదనంగా ఏకంగా రెండు సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఫౌండేషన్, ప్రహరీ పనులు మొదలుపెట్టాడని, దీనికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలు, ఫోటోలను అధికారులకు సమర్పించినా స్థానిక రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అధికారుల ఉదాసీనత వల్లే భూబకాసురులు



బరితెగిస్తున్నారని తీవ్రంగా ఆక్షేపించారు. ప్రజా ఆస్తులను కాపాడటంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన టీడీపీ శ్రేణులు, ఆక్రమణలకు గురైన భూములను తక్షణమే స్వాధీనం చేసుకుని నిర్మాణాలను నేలమట్టం చేయాలని అల్టిమేటం జారీ చేశాయి. అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి బాధ్యులపై కఠిన చర్యలు



తీసుకోకపోతే, ఈ కబ్జా బాగోతాన్ని నేరుగా ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పెద్దఎత్తున పోరాటం చేస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గ్రామంలోని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణమే రంగంలోకి దిగాలని గట్టిగా డిమాండ్ చేశారు.

## విజ్ఞాన విహారం టియూ -142 విమాన మ్యూజియాన్ని సందర్శించిన కేజీబీవీ విద్యార్థులు






**పద్మనాభం, సిటిజెన్ టైమ్స్ ఆగస్టు 27 :**

పద్మనాభం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ) విద్యార్థినులకు విశాఖపట్నంలో ప్రత్యేక విజ్ఞాన యాత్ర నిర్వహించారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మహీంద్రా సంస్థ సహకారంతో చేపట్టిన ఈ ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా విద్యార్థినులు విశాఖ సాగర తీరంలోని ప్రసిద్ధ టి యూ 142 ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియాన్ని ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనను పెంపొందించేందుకు ఈ పర్యటనను ఏర్పాటు చేశారు. ఈ సందర్శనలో భాగంగా యుద్ధ విమాన నిర్మాణం, దానిలోని కీలక విభాగాలు, విమానం పనిచేసే తీరు మరియు విమానయాన సాంకేతికతకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను విద్యార్థినులు క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ఎమర్జెన్సీ ప్రోటోకాల్స్ గురించి మ్యూజియం సిబ్బంది విద్యార్థులకు సవివరంగా వివరించారు. ప్రత్యక్షంగా విమాన విశేషాలను వీక్షించిన విద్యార్థినులు ఎంతో ఉత్సాహంతో ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ఇలాంటి క్షేత్రస్థాయి పరిశీలనల ద్వారా విద్యార్థులకు సరికొత్త విషయాలపై సమగ్ర అవగాహన, ఆలోచనా దృక్పథం పెరుగుతాయని పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యార్థుల మానసిక వికాసానికి, విజ్ఞాన విస్తరణకు ఎంతగానో ఉపయోగపడే ఇలాంటి విజ్ఞాన యాత్రను నిర్వహించిన నాంది ఫౌండేషన్, మహీంద్రా సంస్థల ప్రతినిధులకు పాఠశాల తరఫున ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రేఖవానిపాలెం గ్రామ పంచాయతీను జీవీఎంసీ లో విలీనాన్ని ఏకగ్రీవంగా వ్యతిరేకత

### పంచాయతీ సర్పంచ్ సమ్మిడి శ్రీను అధ్యక్షతన జరిగిన గ్రామ సభ



**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగష్టు 27**

గ్రామ పంచాయతీని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ )లో విలీనం చేయాలనే ప్రతిపాదనపై నిర్వహించిన గ్రామ సభలో గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. గ్రామ సభలో పాల్గొన్న ప్రజల్లో ఒక్కరు కూడా జీవీఎంసీ లో విలీనానికి అనుకూలంగా తమ అభిప్రాయం వ్యక్తం చేయలేదు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు మూకుమ్మడిగా తమ సంతకాలను నమోదు చేసి, తమ గ్రామాన్ని గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని స్పష్టంగా కోరారు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా గ్రామాలను బలవంతంగా జీవీఎంసీ లో విలీనం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామానికి సంబంధించిన పరిపాలన, స్థానిక అవసరాలు, గ్రామ ప్రజల నిర్ణయాధికారం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల అభిప్రాయానికి గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ గ్రామ సభలో నమోదైన ప్రజల ఏకగ్రీవ వ్యతిరేకతను అధికారికంగా పరిగణనలోకి తీసుకుని, ఇంకా సరైన అభివృద్ధిని నోచుకోని పంచాయతీని ను జీవీఎంసీ లో విలీనం చేసే ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని గ్రామ సభ ద్వారా కోరారు. ప్రజల అభిప్రాయమే ప్రజాస్వామ్యానికి పునాది --- ప్రజలు వద్దంటున్న విలీనాన్ని ప్రభుత్వం ఎందుకు బలవంతంగా చేయాలి? గ్రామ ప్రజల ఏకగ్రీవ నిర్ణయాన్ని గౌరవించే వరకు ఈ అంశంపై ప్రజాస్వామ్యబద్ధంగా మా పోరాటాన్ని కొనసాగిస్తాము అని ప్రజలందరూ తెలిపారు. ఒక పంచాయతీ నుంచి మొదలైన ఈ ప్రజా నిర్ణయం... అన్ని మండలాల పంచాయతీలకు దిశానిర్దేశం కావాలి. అభివృద్ధి లేని విలీనం వద్దు గ్రామాలే ముద్దు అనే నినాదం ప్రజలందరూ ముక్తకంఠంతో ఇచ్చారు. ఈ గ్రామ సభలో పంచాయతీ సర్పంచ్ సమ్మిడి శ్రీను, మరియు వార్డు మెంబర్ లు మల్లేటి.మహేశ్,వర లక్ష్మి,సన్యాసమ్మ,హేమలత కృష్ణ,అప్పల స్వామి, ఈశ్వరరావు, పంచాయతీ మాజీ సర్పంచ్ సత్యనారాయణ,ఉప సర్పంచ్ మురళి,కిరణ్ మరియు ప్రజలు అందరూ పాల్గొన్నారు.

## జీవీఎంసీ లో విలీనానికి ససేమిరా

### గండిగుండం గ్రామసభలో ప్రజల కన్నెర్ర




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 27:**

ఆనందపురం మండలంలోని గండిగుండం గ్రామ పంచాయతీని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోకి చేర్చే ప్రతిపాదనలపై స్థానికులు తీవ్రస్థాయిలో తిరుగుబాటు చేశారు. మాజీ సర్పంచ్ గండేడి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో కార్పొరేషన్ విలీనాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ ప్రజలంతా ఏకగ్రీవంగా తీర్పునిచ్చారు. సభకు హాజరైన వారిలో ఒక్కరంటే ఒక్కరు కూడా విలీనానికి సానుకూలత తెలపకపోగా, తమ గ్రామాన్ని స్వతంత్ర పంచాయతీగానే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వందలాదిగా సంతకాలు చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. మౌలిక వసతులు లేక ఇంకా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న గ్రామాలను బలవంతంగా కార్పొరేషన్‌లో కలిపి ప్రజలపై భారాలు మోపడం ప్రజాస్వామ్య విధానాలకు పూర్తి విరుద్ధమని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక స్వపరిపాలన, గ్రామస్తుల నిర్ణయాధికారాలను కాలరాసే ఇలాంటి నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. "అభివృద్ధి లేని విలీనం వద్దు.. గ్రామ పాలనే ముద్దు" అంటూ పెద్దపెట్టున నినాదాలు చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి ప్రభుత్వం విలీన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో న్యాయపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పెద్దఎత్తున పోరాటం ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ గ్రామసభలో రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శి, వీఆర్వో, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని తమ వ్యతిరేకతను అధికారికంగా నమోదు చేయించారు.

## హ్యాపీ రిసార్ట్‌లో బర్త్‌డే వేడుకల్లో ఘర్షణ

### యువకుడిపై కత్తితో దాడి, నిందితుడికి రిమాండ్



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్,ఆగస్టు 27:**

ఆనందపురం మండలంలోని గండిగుండం పరిధిలో ఉన్న హ్యాపీ రిసార్ట్‌లో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వేడుకల సందర్భంగా జరిగిన గొడవలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రిసార్ట్‌లో అన్నపూర్ణ అనే బ్యూటీషియన్ పుట్టినరోజు వేడుకలు జరుగుతుండగా, నిందితుడు ఎర్రా చరణ్ తేజ (21) అక్కడున్న దేవక అనే యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిని గమనించిన వెంకట దినేష్ అనే యువకుడు చరణ్ తేజను అడ్డుకోవడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చెలరేగింది. దీంతో పాత కక్షలను మనసులో పెట్టుకున్న చరణ్ తేజ, దినేష్‌ను హతమార్చాలనే ఉద్దేశంతో వెంట తెచ్చుకున్న చిన్న కత్తితో అతని ఎడమ భుజం వెనుక భాగంలో బలంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో గాయపడిన దినేష్‌ను స్థానికులు వెంటనే విశాఖపట్నంలోని విమ్స్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం అతను అక్కడ చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ ఎర్రం నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్, ప్రత్యక్ష సాక్షుల ఆధారంగా నిందితుడు చరణ్ తేజను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని భీమునిపట్నంలోని 15వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

## అంతర్జాతీయ వేదికపై తెలుగు తేజం

### భూటాన్ గోల్ షాట్‌బాల్ విజేతగా వెల్లంకి విద్యార్థిని పూజిత

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్,ఆగస్టు 27:**

గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఓ విద్యార్థిని అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి దేశ కీర్తి పతాకను ఎగురవేసింది. భూటాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ గోల్ షాట్‌బాల్ సీనియర్ విభాగం పోటీల్లో విశాఖపట్నం జిల్లా వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తాతపూడి పూజిత అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. ఫైనల్ పోరులో ఆతిథ్య దేశమైన భూటాన్ జట్టుపై ఘన విజయం సాధించి, అటు భారతదేశానికి, ఇటు విశాఖ జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాసరావు, అరుణ దంపతుల కుమార్తె అయిన పూజిత, నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ చదువుతో పాటు క్రీడల్లోనూ తిరుగులేని ప్రతిభ కనబరుస్తోంది. ఎనిమిదో తరగతిలోనే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై ఏటా రూ. 12,000 ఉపకార వేతనం అందుకుంటోంది. తొమ్మిదో తరగతిలో రాష్ట్రస్థాయి ప్రాజెక్టు పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించడమే కాకుండా, విద్యా విభాగంలో ఎల్లప్పుడూ పాఠశాల టాపర్‌గా నిలుస్తోంది. క్రీడారంగంలోనూ తన జోరు కొనసాగిస్తూ, ఈ ఏడాది మే నెలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడి బిహార్‌పై విజయం సాధించి రాష్ట్రస్థాయిలో రన్నరప్‌గా నిలిచింది. ఈ కుటుంబంలో పూజితతో పాటు ఆమె సోదరి తాతపూడి కుసుమ కూడా క్రీడల్లో విశేష ప్రతిభ కనబరుస్తోంది. ప్రస్తుతం ఇంటర్ ప్రథమ




సంవత్సరం చదువుతున్న కుసుమ, గత ఏడాది ఆదిలాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏపీ జట్టు తరఫున పాల్గొని ద్వితీయ స్థానం సాధించింది. కులవృత్తినే నమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అంతర్జాతీయ వేదికపై విజయకేతనం ఎగురవేసిన పూజితను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాడిశెట్టి రమేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు తోనంగి సరిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా అభినందించారు. పూజిత భూటాన్ పర్యటనకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహించిన వైజాగ్ రోటరీ క్లబ్ సభ్యులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

## విద్యార్థులకు ప్రథమ చికిత్సపై ప్రత్యేక శిక్షణ



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 27:**

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే కీలకమైన అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. అరణ్య క్యాంపింగ్ సెంటర్‌లో జరుగుతున్న 'ద్వితీయ సోపాన' శిక్షణా తరగతులలో భాగంగా విద్యార్థులకు ప్రథమ చికిత్స విధానాలపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఆపద సమయాల్లో గాయపడిన వారికి డాక్టర్ వద్దకు తీసుకెళ్లేలోపు చేయాల్సిన ప్రాథమిక వైద్య సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ఈ సందర్భంగా క్షుణ్ణంగా వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ ఎం.డి. రహమతుల్లా హాజరై విద్యార్థులకు ప్రథమ చికిత్స మెలకువలను నేర్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే ఎలా స్పందించాలి, రక్తస్రావాన్ని ఎలా అరికట్టాలి, స్పృహతప్పిన వారికి ఎలాంటి సాయం అందించాలి అనే అంశాలపై విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో పాటు ప్రాథమిక వైద్య పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ డాక్టర్ మారుతి హరీష్ కుమార్, జాయింట్ సెక్రటరీ పి. కృష్ణవేణి, డి. సుభద్ర దేవి, ఎస్. వెంకటేశ్, కె. శ్రావణి, కరిమునిష, పి. రామచంద్రారెడ్డి, వై. నందకుమారి, ఆర్. కృష్ణవేణితో పాటు పెద్ద సంఖ్యలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు. ఇలాంటి శిక్షణల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవా దృక్పథం పెరుగుతాయని ప్రతినిధులు పేర్కొన్నారు.

## అక్రమమద్యంవిక్రయాలు, మహిళ అరెస్ట్

### 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న భీమిలి పోలీసులు

**భీమునిపట్నం,సిటిజన్ టైమ్స్, ఆగస్టు 27**

చేపలుప్పాడ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో భీమునిపట్నం పోలీసులు గురువారం ఉదయం ఆకస్మిక దాడులు నిర్వహించారు. సబ్-ఇన్‌స్పెక్టర్ చ. లలితాదిత్య తన సిబ్బందితో కలిసి ఉదయం 7:30 గంటల సమయంలో చేపలుప్పాడ పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో



ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేకుండా అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న ఒక మహిళను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి ఎనిమిది ఏసీ బ్లాక్ (180 ఎంఎల్) మద్యం బాటిళ్లు, రెండు హెచ్‌డీ విస్కీ (180 ఎంఎల్) బాటిళ్లు సహా మొత్తం పది బాటిళ్లను (1.8 లీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. పరిధిలో అక్రమ మద్యం నిల్వలు, రవాణా, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ‘వాయిదాలు వద్దు.. తక్షణమే న్యాయం చేయండి!’

## విశాఖ ఎయిర్‌పోర్టు కార్మికుల రణభేరి






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 27:**
విశాఖపట్నం విమానాశ్రయ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళన గురువారంతో 11వ రోజుకు చేరి మరింత ఉధృతంగా మారింది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సుమారు 300 మంది కార్మికులు రోడ్డుపైనే వంటావార్పు కార్యక్రమం నిర్వహించి తమ నిరసన గళాన్ని విప్పారు. వారం రోజుల్లో ఎంపీ ఎంవీ భరత్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామంటూ విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) ఇచ్చిన హామీని కార్మికులు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఇప్పటికే 11 రోజులుగా రోడ్డున పడ్డామని, నెలాఖరు కావడంతో ఇంటి అద్దెలు, కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మరో వారం రోజుల గడువు కుదరదని, ఈరోజే సమస్యను పరిష్కరించాలని కార్మికులు తెగేసి చెప్పారు. “ఈరోజే మాకు న్యాయం చేయాలి.. లేకపోతే మమ్మల్ని చంపేయండి” అంటూ మహిళా కార్మికులు వై.సునీత, బి.జ్యోతి కన్నీటిపర్యంతమైన దృశ్యాలు కార్మికుల తీవ్ర నిస్సహాయతను చాటిచెప్పాయి. కాగా, విశాఖ పర్యటనకు వస్తున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను నేరుగా కలిసి తమ సమస్యను వివరించి శాశ్వత పరిష్కారం కోరాలని కార్మికులు నిర్ణయించారు. కార్మికుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్, రాధా రంగా రాయల్ అసోసియేషన్ ప్రతినిధి గద్దె బాలాజీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలాది కుటుంబాల భవిష్యత్తు ముడిపడి ఉన్న కార్మికుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడవద్దని, ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే ప్రభుత్వానిదే పూర్తి బాధ్యతని హెచ్చరించారు. ఉన్నతాధికారులతో తక్షణమే చర్చలు జరిపి, 11 రోజుల పోరాటానికి నేడే న్యాయమైన ముగింపు పలకాలని డిమాండ్ చేశారు.

## ఆలయ పునః నిర్మాణానికి విరాళాలు

### స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న దాతలు

### వేగవంతంగా నిర్మాణ పనులు



**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**
మురమళ్ల: నిత్య కళ్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణానికి విరాళాలు అందించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గురువారం విరాళం అందించిన దాత హైద్రాబాద్ కి చెందిన ఏ. ఆశిష్ రూ.1 లక్ష విరాళం, ముమ్మిడివరం నకు చెందిన తాడి వెంకట రెడ్డి రూ.1 లక్ష 116..విరాళం ఆలయ చైర్మన్ కు అందజేశారు. ఈసందర్భం గా దాతను ప్రత్యేక దర్శనం అందించారు.ఆలయ మర్యాదలతో శేష వస్త్రం, చిత్ర పటం, ప్రసాదం అందించి సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు. శ్రీ స్వామి వారి ఆలయ పునః నిర్మాణం స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పర్యవేక్షణలో జరుగుతున్న విషయం తెలిసిందే..ఈ సందర్భంగా నిర్మాణానికి విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. గర్భాలయ, అంతరాలయ, నంది మండపం సంబంధించి నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రూ. లక్ష లేదా ఆపై విరాళం అందించే దాత పేరు శిలాఫలకం పై వేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కఠారి శ్రీనివాస రాజు తదితరులు ఉన్నారు.

## మడ చెట్లకు రక్షగా ‘మహా రాఖీలు





**సిటిజన్ టైమ్స్, ఆగస్టు 27:(కాకినాడ)**
తీరప్రాంతాన్ని కాపాడే అరుదైన జీవావరణ వ్యవస్థ కలిగిన మడ అడవుల పరిరక్షణ మనందరి బాధ్యతని, వాటి రక్షణకై ‘వృక్షాబంధన్’ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) ఎన్. రామచంద్ర రావు పిలుపునిచ్చారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం కోరింగ అభయారణ్యంలో గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో ఆధ్వర్యంలో విద్యార్థులతో విత్తన రాఖీల తయారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ‘మన తీరంలో మనమే వనాలు పెంచుదాం’ అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ, 2000వ సంవత్సరం నుంచి విద్యార్థులతో దేశీయ విత్తనాల రాఖీలను తయారు చేయిస్తూ పర్యావరణ పరిరక్షణపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు వరప్రసాద్, సిద్ధార్థ, మహేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

## స్వర్ణ అవార్డు ప్రత్యేక గ్రీవెన్స్ కి అర్జీలు

### అమలాపురం మున్సిపల్ కమీషనర్ నిర్మల్ కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**
పురపాలక సంఘం పరిధిలోని కల్వకొలను వీధి స్వర్ణ వార్డు నందు నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కు స్థానిక ప్రజలు 7 అర్జీలు అందజేయడం జరిగినది. వీటిలో ప్రధానంగా పారిశుద్ధ్యం, త్రాగు నీరు సమస్య, వీధి కుక్కల సంచారం, వీధి దీపాలు సమస్య, కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, నిర్మాణం ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు పెరుగుదల వంటి సమస్యలపై స్థానిక ప్రజలు తమ అర్జీలను మున్సిపల్ కమీషనరుకు అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ, సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని అర్జీదారులకు తెలియజేశారు. స్థానిక ప్రజలు అందజేసిన అర్జీలపై సంబందిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డు కార్యదర్శులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ విశాఖ శాటిలైట్ సిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం





**విశాఖపట్నం, ఆగస్టు 27:(సిటిజన్ టైమ్స్ ):**
రోటరీ క్లబ్ ఆఫ్ వాల్తేర్ ఆధ్వర్యంలోని రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ విశాఖ శాటిలైట్ సిటీ (47217) 28వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ‘అగ్ని’ ఆదివారం ఘనంగా జరిగింది. 2026-27 సంవత్సరానికి గాను క్లబ్ నూతన అధ్యక్షురాలిగా అనూష చెన్నా, కార్యదర్శిగా గీతిక జగుపల్లి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా రోటరియన్ అజయ్ కుమార్, పీడీఆర్ఆర్‌లు జీవన్, ప్రదీప్, అలేఖ్య, ఐపీడీఆర్ఆర్ కృష్ణ, జెడ్ఆర్ఆర్ ఆశిష్, అనిల్ కుమార్ హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. 2025-26 సంవత్సరంలో అధ్యక్షుడిగా పనిచేసిన నీరజ్ కుమార్ తంటిపాక ఆధ్వర్యంలో వీరాంగన 2.0, తిరంగా వాకథాన్, ఫీడ్ ది స్ట్రీట్, ఫీడ్ ది స్ట్రే, ప్రధాన్ రక్తదాన శిబిరాలు, జాబ్ డ్రైవ్‌లతో సహా 70కి పైగా విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ విశిష్ట సేవలకు గాను క్లబ్‌కు బెస్ట్ పబ్లిక్ ఇమేజ్, బెస్ట్ క్లబ్ సర్వీస్, బెస్ట్ యూత్ ఒ స్పోర్ట్స్, బెస్ట్ ఇన్‌స్టాలేషన్ అవార్డులు లభించాయి. విజయవంతంగా పదవీకాలం పూర్తి చేసుకున్న నీరజ్ కుమార్ తంటిపాక.. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 ‘డిస్ట్రిక్ట్ ప్రొఫెషనల్ సర్వీస్ డైరెక్టర్’గా నియమితులై బాధ్యతలు స్వీకరించారు. గడచిన ఏడాది క్లబ్ విజయాల్లో కీలకపాత్ర పోషించి, 2026-27 నూతన క్లబ్ అడ్వైజర్‌గా ఎన్నికైన అఖిల్ పట్నాయక్ వంద్రంగికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 50 మందికి పైగా రోటరాక్టర్లు పాల్గొని నూతన బృందాన్ని అభినందించారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

### విశాఖ కలెక్టర్ స్పష్టీకరణ





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 27**
ప్రజలు సంతృప్తి చెందేలా, స్నేహపూర్వక వాతావరణంలో రెవెన్యూ సేవలు అందించాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వేగవంతంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ఆక్రమణల నివారణ, కన్వేయన్స్ డీడ్ల అమలు, రీ-సర్వే, 22-ఏ డీ-నోటిఫికేషన్ ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జీవో నెం. 296, 388, 30 ప్రకారం కన్వేయన్స్ డీడ్ల ప్రక్రియను వేగవంతం చేసి, ప్రతిరోజూ పురోగతి నివేదికలు సమర్పించాలని నిర్దేశించారు. అలాగే గాజువాక, యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీవో నెం. 27, 84 అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ సేవలపై ప్రజల్లో సానుకూల దృక్పథం కలిగేలా అధికారులు పనిచేయాలని, ఎఫ్-లైన్, ఆర్.ఓ.ఆర్., మ్యుటేషన్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సేవల నాణ్యతను తెలుసుకునేందుకు కలెక్టరేట్ నుంచి నేరుగా ప్రజలకు ఫోన్ చేసి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని, ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వెంటనే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, సర్వే శాఖ ఏడీ రామకృష్ణ, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, తహశీల్దార్లు, డీటీలు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## చెట్లకు రాఖీలు కట్టిన విద్యార్థులు

### ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో వినూత్న కార్యక్రమం



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 27**
రాఖీ పండుగను పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వినూత్న కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్, కళాశాల ఎకోక్లబ్ మరియు బోటనీ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని చెట్లకు విద్యార్థులు రాఖీలు కట్టారు. చెట్లను సోదరుల్లా భావించి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. ప్రకృతిని పరిరక్షించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మాట్లాడుతూ ప్రస్తుతమే కాకుండా భవిష్యత్తు కూడా ప్రకృతిపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని పేర్కొన్నారు. అన్నాచెల్లెళ్లు ఒకరినొకరు రక్షించుకునే ప్రతిజ్ఞతో రాఖీ కట్టుకున్నట్లే, చెట్లకు రాఖీలు కట్టి వాటిని సంరక్షించాలనే సంకల్పం మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. విద్యార్థులు ఒక్కొక్కరు చెట్లను దత్తత తీసుకొని సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఓ మహ్మద్ ఇర్ఫాన్, అధ్యాపకులు అంజయ్య, వనిత, ఉమాదేవి, కోదండరాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ధర్నా

### కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 27**
ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. నూతన ఆరోగ్య పథకాన్ని అమలు చేయడంతో పాటు రెండో వేతన సవరణ సంఘాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఉద్యోగ, వైద్య, ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# తిమ్మాజిపేట ఎస్ఐపై ఆరోపణలు అవాస్తవం

### ఎటువంటి మెడికల్ ఆధారాలు లేవు, తప్పుడు ప్రచారంపై చర్యలు తప్పవు



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 27**

నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట ఎస్ఐపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తిమ్మాజిపేట ఘటనకు సంబంధించి విచారణ అధికారి సీఐ అశోక్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ఐ మూత్ర విసర్జన చేశారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఎలాంటి మెడికల్ ఆధారాలు లేవని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని సీఐ అశోక్ రెడ్డి తెలిపారు. ఇదంతా కేవలం తప్పుడు ప్రచారమేనని కుండబద్దలు కొట్టారు. కావాలనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అధికారులు తేల్చి చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా యూట్యూబ్ ఛానెళ్లు అవాస్తవాలను ప్రచారం చేయవద్దని డీఎస్పీ గట్టిగా హెచ్చరించారు. లేనిపోని అసత్యాలను ప్రచారం చేస్తే సదరు ఛానెళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులతో కలిసి భూ పరిశీలన చేసినశాసనసభ సభ్యులు

### వాగ్దానాన్ని నిలబెట్టుకుంటాం వారెవ్వా కూటమి ప్రభుత్వం అనిపించుకుంటాం



**పెద ముసిడివాడ: (సిటిజన్ టైమ్స్); ఆగస్టు: 27**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా తాడి గ్రామ తరలింపు చర్యలు వేగవంతం చేశారు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు. ఇందులో భాగంగా తాడి గ్రామస్తులను వెంటబెట్టుకొని పెదముసిడి వాడ సమీపంలోని తాడి తరలింపు కోసం కేటాయించిన స్థలాన్ని అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక తాసిల్దార్, మైనింగ్ అధికారులు, మిగిలిన శాఖల అధికారులకు కొన్ని సూచనలు చేశారు. తాడి గ్రామంలో ఇప్పటివరకు పక్కాగా ఉన్న లబ్ధిదారుల జాబితా ప్రకారం స్థలాలను సిద్ధం చేయాలని, ఈ స్థలాల కేటాయింపులో ఎటువంటి సిఫార్సులను లెక్క చేయవద్దని అధికారులు ఆదేశించారు. అదేవిధంగా పెద్దముసిడి వాడ పంచాయతీలో గత ప్రభుత్వంలో ల్యాండ్ ఫిల్లింగ్ కార్యక్రమంలో ఇప్పటివరకు పట్టాలు అందని వారికి కూడా ఇక్కడే స్థలాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ తాడి తరలింపు సమస్య ఎన్నో ఏళ్లుగా ఉన్నప్పటికీ, ఎన్ని ప్రభుత్వాలు మారినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, అయితే తాడి ప్రజల ఆవేదన అర్థం చేసుకొని రాజకీయాలు పక్కనపెట్టి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించడమే కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ఎమ్మెల్యేఅన్నారు.

# 28న ఎంపీడీవో కార్యాలయంలో వన్ మంత్- వన్ విలేజ్- ఫోర్ విజిట్స్

### కాకినాడ రూరల్ ఎంపీడిఓ కార్యాలయంలో ఉ. 10 గంటల నుంచి మ.01 గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీల స్వీకరణ..

### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ సిటిజన్ టైమ్స్,ఆగస్టు 27**

"ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమాన్ని కాకినాడ రూరల్ నియోజకవర్గం స్థాయిలో ఈ నెల 28న కాకినాడ రూరల్ మండలం ఎంపీడీఓ కార్యాలయంలో వరుసగా రెండో వారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రస్థాయి సమస్యలకు తక్షణం పరిష్కారించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఈ నెల 28వ తేదీ శుక్రవారం, రమణియ పేటలోని కాకినాడ రూరల్ ఎంపీడిఓ కార్యాలయంలో ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. కాకినాడ రూరల్ నియోజక వర్గంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు శుక్రవారం కాకినాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి ఉదయం 9:30 నిమిషాలకే విధిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.




# రాఖీ పౌర్ణమి






'రాఖీ', 'రక్షా బంధన్' లేదా 'రాఖీ పౌర్ణమి– అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంద్యాల పూర్ణిమ అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. కొంతకాలం క్రితం వరకూ ఉత్తర , పశ్చిమ భారతదేశాలలో ఈ పండుగను చాలా వైభవంగా జరుపుకునేవారు. ఇప్పుడు దేశమంతటా జరుపుతున్నారు. అన్నకుగాని తమ్మునికిగాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రధాన విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు , అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ. అది చాలా ఉత్సాహంతో జరుపుకుంటూరు.

**రక్షాబంధన్ ఎలా ప్రారంభమైందంటే..**

పూర్వం దేవతలకు , రాక్షసుల కు మధ్య పుష్కరకాలం యుద్ధం సాగింది. యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు నిర్వీర్యుడై , తన పరివారమంతటినీ కూడగట్టుకొని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సాహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచిస్తుంది. రాక్షస రాజు అమరావతిని దిగ్బంధనం చేస్తున్నాడని తెలుసుకొని భర్త దేవేంద్రుడికి సమరం చేయడానికి ఉత్సాహాన్ని కల్పిస్తుంది. సరిగ్గా ఆ రోజు రావణ పౌర్ణమి కావడంతో పార్వతీ పరమేశ్వరుల ను, లక్ష్మీనారాయణులను పూజించి రక్షను దేవేంద్రుడి చేతికి కడుతుంది. అది గమనించిన దేవతలందరూ వారు పూజించిన రక్షలను తీసుకువచ్చి ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. శచీదేవి ప్రారంభించిన ఆ రక్షాబంధనం.. నేడు రాఖీ పండుగగా ఆచారమైందని పురాణాలు చెబుతున్నాయి.

**రాఖీపౌర్ణమి చరిత్ర:**

**ద్రౌపది - శ్రీకృష్ణుని బంధం:**

ఇతిహాసాల ప్రకారం చూస్తే ద్రౌపది , శ్రీకృష్ణుడి కి అన్నాచెల్లెల అనుబంధం అత్యంత గొప్ప అనుబంధంగా కనిపిస్తుంది. శిశుపాలుడి ని శిక్షించే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణుని చూపుడు వేలుకు రక్తం ధారగా కారుతుందట. అది గమనించిన ద్రౌపది తన పట్టుచీర కొంగు చింపి వేలికి కట్టు కట్టిందట. దానికి కృతజ్ఞతగా ఎల్లవేళలా అండగా ఉంటానని శ్రీకృష్ణుడు ద్రౌపదికి హామీ ఇస్తాడు. అందుకు ప్రతిగా దుశ్శాసనుడి దురాగతం నుండి చీరలిచ్చి ఆమెను కాపాడుతాడు.

**శ్రీ మహావిష్ణువు - బలిచక్రవర్తి:**

శ్రీ మహావిష్ణువు బలి చక్రవర్తి కోరిక మేరకు అతనితోపాటు పాతాళంలో ఉండిపోతాడు. శ్రీమహాలక్ష్మి వెళ్లి బలిచక్రవర్తికి రక్షాబంధంకట్టి , తన భర్తను వైకుంఠానికి తీసుకొనిపోతుంది. అందుకే రక్షాబంధానికి ఇంత ప్రాధాన్యత ఏర్పడింది. (ప్రాచీన గాథ

"యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః తేన త్వా మభిబధ్నామి రక్షే మా చల మా చల"

**భావం:** "ఓ రక్షాబంధమా ! మహాబలవంతుడూ , రాక్షసరాజు అయిన బలిచక్రవర్తిని బంధించినావు. కాబట్టే నేను నిన్ను ధరిస్తున్నాను.)"

**అలెగ్జాండర్ భార్య - పురుషోత్తముడి కథ:**

చరిత్రపుటల్లో అలెగ్జాండర్ భార్య 'రోక్సానా' తక్షశిల రాజు పురుషోత్తముడిని తన సోదరుడిగా భావించి రాఖీ కడుతుంది. జగజ్జేతగా మారాలనే తపనతో గ్రీకు యువరాజు అలెగ్జాండర్ క్రీస్తు పూర్వం 326లో భారత దేశంపై దండెత్తుతాడు. ఆ క్రమంలో బాక్ట్రియా (నేటి ఆఫ్ఘనిస్తాన్ )కు చెందిన యువరాణి రోక్సానాను వివాహం చేసుకుంటాడు. ఆమె వివాహసంబంధాన్ని ఉపయోగించుకుని మధ్య ఆసియా దేశాలను , ముఖ్యంగా జీలం , చినాబ్ నదుల మధ్య ఉన్న రాజ్యాలను జయించాలని అలెగ్జాండర్ ఆలోచన. అలెగ్జాండర్ యుద్ధం ప్రకటిస్తాడు. పురుషోత్తముడి శత్రు రాజు అంబి , అలెగ్జాండర్‌ను భారతదేశంపై దండెత్తాలని ఆహ్వానిస్తాడు. పురుషోత్తముడు యుద్ధానికి సిద్ధమవుతాడు. అయితే అలెగ్జాండర్ భార్య రోక్సానా పురుషోత్తముడిని తన అన్నలా భావించి రాఖీ కడుతుంది. తన భర్త అయిన అలెగ్జాండర్‌ను చంపవద్దని రోక్సానా పురుషోత్తముడిని కోరుతుంది. దీంతో పురుషోత్తముడు యుద్ధం గెలిచినా అలెగ్జాండర్‌ను చంపకుండా విడిచిపెడతాడు.

**హయగ్రీవావతారం:**

శ్రీ మహావిష్ణువు విజయగాథా పరంపరలలో హయగ్రీవావతారంలో జరిగిన విజయం కూడా విశేషంగా చెబుతారు.. పూర్వం ఓసారి హయగ్రీవుడు అనే ఓ రాక్షసుడు దేవిని గురించి తీవ్రంగా తపస్సు చేశాడు.

ఆ తపస్సుకు మెచ్చిన దేవి వరం కోరుకొమ్మన్నప్పుడు తనకు మరణం లేకుండా చూడమన్నాడు. అయితే ఆమె అదిసాధ్యపడదని చెప్పినప్పుడు హయగ్రీవం (గుర్రపు తల) ఉన్నవాడి చేతిలో మాత్రమే తనకు మరణం వచ్చేలా అనుగ్రహించమన్నాడు. ఆమె ఆ రాక్షసుడిని అనుగ్రహించి అంతర్ధానమైంది. ఆ వరంతో ఆ రాక్షసుడు దేవతలను ముప్పతిప్పలు పెడుతుండేవాడు. విష్ణుమూర్తి ఆ రాక్షసుడిని యుద్ధంలో నిరంతరం ఎదిరిస్తున్నా ఫలితం లేకపోయింది. చివరకు శివుడు ఓ ఉపాయాన్ని పన్నాడు. శ్రీ మహావిష్ణువు ధనుస్సుకు బాణాన్ని సంధించి ఉంచి విపరీతమైన అలసట కలిగి అగ్రభాగాన వాలి నిద్రపోయాడు. ఆయనను నిద్రలేపటానికి దేవతలెవరికీ ధైర్యం చాలలేదు. అయితే ఆ దేవతలంతా ఓ ఆలోచనకు వచ్చి వమ్రి అనే ఓ కీటకాన్ని పంపి ధనుస్సుకున్న అల్లెతాడును కొరకమని చెప్పారు. అలా చేస్తే తాడు వదులై విల్లు కదలి విష్ణువుకు మెలకువ వస్తుందన్నది వారి ఆలోచన. అయితే ఆ పురుగు తాడును కొరకగానే దేవతలు ఊహించని విధంగా వింటికి ఉన్న బాణం విష్ణువు మెడకు తగిలి ఆ దెబ్బకు విష్ణువు తల ఎటో ఎగిరి వెళ్ళింది. దేవతలు అంతటా వెదికారు కానీ ఆ తల కనిపించలేదు. బ్రహ్మదేవుడు వెంటనే దేవిని గురించి తపస్సు చేశాడు. అప్పుడామె ప్రత్యక్షమై ఒక గుర్రపు తలను తెచ్చి విష్ణుమూర్తి శరీరానికి అతికించమని చెప్పింది. దేవతలు అలాగే చేశారు. ఆ హయగ్రీవం అతికిన విష్ణుమూర్తిలో మళ్ళీ జీవం వచ్చి లేచాడు. ఆ లేచిన రోజే శ్రావణ పూర్ణిమ. ఆ తర్వాత హయగ్రీవుడుగా మారిన విష్ణుమూర్తి రాక్షసుడిని సులభంగా జయించాడు. దేవీ శక్తి మహిమను , శ్రీ మహావిష్ణు తత్వాన్ని ఈ కథ తెలియచెప్తుంది. అందుకే శ్రావణ పూర్ణిమ నాడు హయగ్రీవ జయంతి కూడా జరపడం కనిపిస్తుంది.

# రోబోటిక్, అడ్వాన్స్డ్ లాప్రోస్కోపిక్ సర్జరీలతో సులభంగా క్లిష్టమైన చికిత్సలు

### సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ కృష్ణ చౌదరి

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో ఆగస్ట్ 27**





సాధారణంగా 24 గంటల సుదీర్ఘ సమయం పట్టే అత్యంత క్లిష్టమైన పేగు ఆపరేషన్లను సైతం లేటెస్ట్ అడ్వాన్స్ లాప్రోస్కోపిక్ విధానం ద్వారా అత్యంత విజయవంతంగా చేయగల సామర్థ్యం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో ఉందని గ్యాస్ట్రో ఎంటరాలజీ డాక్టర్ కృష్ణ చౌదరి స్పష్టం చేశారు. అలాగే కిడ్నీ, అండాశయ (ఓవరీ), గ్యాస్ట్రో ఎంటరాలజీ తదితర క్లిష్టమైన సమస్యలతో బాధపడే వారికి రోబోటిక్ టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ అధునాతన రోబోటిక్ మరియు లాప్రోస్కోపిక్ విధానాల్లో కోత చాలా తక్కువగా ఉండటం వల్ల పేషెంట్లు ఆపరేషన్ తర్వాత తక్కువ సమయంలోనే కోలుకుని తమ దైనందిన పనుల్లోకి త్వరగా వెళ్లవచ్చని ఆయన తెలిపారు. అంతేకాకుండా, ఈ అత్యాధునిక రోబోటిక్ మరియు లాప్రోస్కోపిక్ చికిత్సలకు పూర్తి స్థాయి హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ కూడా వర్తిస్తుందని, కాబట్టి రోగులు ఆర్థిక భారం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్లు సుదర్శన్ రెడ్డి, రాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు ఈ అత్యాధునిక వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని మెరుగైన ఆరోగ్యాన్ని పొందాలని వారు సూచించారు. ఈ సర్జరీల వల్ల ఉపయోగాలు వేగవంతమైన రికవరీ, రోబోటిక్ మరియు అత్యాధునిక లాప్రోస్కోపిక్ విధానాల ద్వారా కోత తక్కువగా ఉండటం వల్ల రోగులు ఆపరేషన్ తర్వాత చాలా త్వరగా కోలుకుంటారు. ఇన్సూరెన్స్ సౌకర్యం: ఈ అత్యాధునిక రోబోటిక్, లాప్రోస్కోపిక్ చికిత్సలకు ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) కవరేజ్ కూడా వర్తిస్తుందని, రోగులు ఆర్థిక భారం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రజలు ఈ అత్యాధునిక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# మృత్యుంజయులు -23 రోజుల నరకం తర్వాత ఒడ్డుకు చేరిన కోనసీమ మత్స్యకారులు!

**అమలాపురం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 27**

సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారులు ఎట్టకేలకు 23 రోజుల తర్వాత పశ్చిమ బెంగాల్ తీరంలో క్షేమంగా లభ్యమయ్యారని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ వెల్లడించారు. గురువారం కలెక్టరేట్ లో ఎస్పీ రాహుల్ మీనా, మత్స్యశాఖ జేడీ కరుణాకర్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. అల్లవరం మండలం కొమరిగిరిపట్నానికి చెందిన "ముత్యాలమ్మ" బోటులో ఆగస్టు 3న ఓడలరేవు నుంచి ఏడుగురు మత్స్యకారులు 15 రోజుల వేటకు వెళ్లగా, అదే రోజు మధ్యాహ్నం నుంచి కమ్యూనికేషన్ నిలిచిపోయింది. ఆగస్టు 14న బోటు యజమాని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రభుత్వం వెంటనే అప్రమత్తమై నేవీ, కోస్ట్‌గార్డ్, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్, మయన్మార్ సరిహద్దు విభాగాల సహకారంతో విస్తృత గాలింపు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఆగస్టు 26న పశ్చిమ బెంగాల్‌లోని దిగా తీరంలో "అరబింద బార్మన్" బోటు సిబ్బంది వీరిని గుర్తించారు. బోటు ఇంజిన్ గేర్‌బాక్స్ పాడవడంతో నియంత్రణ కోల్పోయి సముద్రంలో కొట్టుకుపోయినట్లు గుర్తించిన అధికారులు, దాదాపు 10 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి బోటును సురక్షితంగా పోర్టుకు చేర్చారు. డ్రైవర్ తాతారావు స్వల్ప అస్వస్థతకు గురికాగా, మిగిలిన ఆరుగురు పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి విశ్రాంతి



గదిలో ఉంచారు. మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక వాహనంతో పాటు ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌ను పశ్చిమ బెంగాల్ పంపింది. 15 రోజుల ఆహారంతో 23 రోజులు సముద్రంలో వీరు ఎలా ప్రాణాలు కాపాడుకున్నారనే వివరాలను డాక్యుమెంట్ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, సముద్రంలోకి వెళ్లే బోట్లలో సాంకేతిక భద్రత, కమ్యూనికేషన్ వ్యవస్థల ఏర్పాటుపై మత్స్యకారులతో సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం (బ్రెయిన్‌స్టార్మింగ్ సెషన్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. మత్స్యకారులు సురక్షితంగా దొరకడంతో వారి కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



**మంగళగిరి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 27**

రాష్ట్ర విద్యా, ఐటీ మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేష్ ని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ గురువారం ఆయన నివాసంలో కలుసుకున్నారు.. ఈ సందర్భంగా నియోజవర్గ అభివృద్ధి, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ,స్థానిక సంస్థల ఎన్నికలు, డోర్ టు డోర్ కార్యక్రమం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. చింతలపూడి నియోజక వర్గ సర్వోత్తముఖాభివృద్ధి కి చర్యలు చేపడతామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

# ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏపీ సి ఆర్ డి ఏ సమావేశం

**అమరావతి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 27**

రాష్ట్ర రాజధాని అయినటువంటి నిర్మాణ పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ సిఆర్డిఏ 65వ సమావేశం జరిగింది. మంత్రులు నారాయణ పయ్యావుల కేశవ తో పాటు పట్టణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్ కుమార్ సంబంధిత కమిషనర్ విజయరామరాజు ఆ సమావేశానికి హాజరయ్యారు. కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అక్కడ ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ పురోగతి నిర్మాణ పనులు వేగం గురించి, అదేవిధంగా తదితర అంశాలపై అధికారులను ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



# ఎంపీ హరీష్ కృషితో మత్స్యకారులు సురక్షితం

## అమలాపురం ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి చొరవతో పశ్చిమ బెంగాల్ నుంచి ఏడుగురు మత్స్యకారుల సురక్షితం



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారుల సురక్షిత రాక కోసం అమలాపురం పార్లమెంట్ సభ్యులు జి.ఎం. హరీష్ బాలయోగి వ్యక్తిగతంగా చొరవ తీసుకుని, మొత్తం వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మత్స్యకారుల ఆచూకీ లభించిన వెంటనే, పశ్చిమ బెంగాల్ మెరైన్ డీఐజీ తో పాటు అక్కడి



ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ, మత్స్యకారులను సురక్షితంగా పశ్చిమ బెంగాల్ నుంచి స్వస్థలమైన అమలాపురానికి తరలించే ఏర్పాట్లు చేశారులి. ప్రస్తుతం ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ నుంచి అమలాపురం వైపు బయలుదేరారు. వారి ప్రయాణంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నేరుగా స్వగ్రామాలకు చేరుకునేందుకు అమలాపురం ఎంపీ జి.ఎం.హరీష్ బాలయోగి ప్రత్యేకంగా టెంపో ట్రావెలర్ వాహనాన్ని ఏర్పాటు చేశారులి. మత్స్యకారులు తమ కుటుంబ సభ్యుల వద్దకు క్షేమంగా చేరుకునే వరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎంపీ హరీష్ బాలయోగి స్వయంగా పర్యవేక్షిస్తూ, ప్రతి దశలో సంబంధిత అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సురక్షిత రాక కోసం సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పశ్చిమ బెంగాల్ అధికారులు మరియు ఈ సహాయక చర్యల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి కృతజ్ఞతలు తెలిపారు.

## మలికిపురం మండలంలో రూ.4.82 కోట్లతో రోడ్లు శంకుస్థాపనలు



**మలికిపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

మండలంలో ఎస్ ఏ ఎస్ సి ఐ నిధులతో చేపట్టనున్న పలు రోడ్ల నిర్మాణా పనులకు రాజోలు ఎమ్మెల్యే శ్రీ దేవ వరప్రసాద్ గ శంకుస్థాపన చేశారు. విశ్వేశ్వరాయపురం ఆర్అండ్ బి రోడ్ నుంచి కేర్ హాస్పిటల్ ఆర్ అండ్ బి రోడ్ వరకు చినబూరిగ మీదుగా 1.200 కి.మీ బీటీ రోడ్ నిర్మాణానికి రూ.81 లక్షలు మంజూరయ్యాయి. చినబూరిగ వంతెన వద్ద పనులకు శంకుస్థాపన చేశారు. లక్కవరం--గుబ్బలపాలెం పంచాయతీరాజ్ రోడ్ నుంచి ఇరుసుమండ ఆదర్శనగర్ వరకు 1.529 కి.మీ సీసీ రోడ్ నిర్మాణానికి రూ.1.08 కోట్లు, లక్కవరం ఆర్ అండ్ బి రోడ్ నుంచి గుబ్బలపాలెం ఆర్ అండ్ బి రోడ్ వరకు 1.457 కి.మీ సీసీ రోడ్ నిర్మాణానికి రూ.1.24 కోట్లు వ్యయం కానున్నాయి. ఇరుసుమండ గ్రామంలో ఈ పనులకు శంకుస్థాపన చేశారు. బట్టేలంక హైస్కూల్ ఆర్డబి రోడ్ నుంచి ఇరుసుమండ--అడవిపాలెం ఆర్ అండ్ బి రోడ్ వరకు 0.890 కి.మీ సీసీ రోడ్ నిర్మాణానికి రూ.63 లక్షలు కేటాయించారు. అడవిపాలెం సాలిపేట ఎంట్రన్స్ వద్ద శంకుస్థాపన జరిగింది. గూడపల్లి సినిమాహాల్ ఆర్ అండ బి రోడ్ నుంచి పోలమూరి వారి కాలనీ వరకు 1.686 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.1.06 కోట్లు కేటాయించారు. గూడపల్లి సినిమాహాల్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ రోడ్ల నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు రైతులు, విద్యార్థులు, కార్మికులు, వీవర్స్ కాలనీల ప్రజలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

### నాగర్‌కర్నూల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హామీ

**నాగర్‌కర్నూల్,సిటిజన్ టైమ్స్,ఆగస్టు 27:**

నాగర్‌కర్నూల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ ప్రతినిధులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల వినతులపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నెల రోజుల్లోపే అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు జర్నలిస్టుల ప్రధాన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, విధి నిర్వహణలో వారికి తగిన భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో సకల సౌకర్యాలతో కూడిన మీడియా పాయింట్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ మరియు ఆరోగ్య పథకాలు జర్నలిస్టుల కుటుంబాలకు అందేలా చూడాలని కోరారు. అలాగే ప్రభుత్వ శాఖల నుంచి అధికారిక సమాచారం సకాలంలో అందేలా సమన్వయం చేయాలని, సమస్యల సమగ్ర పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ. పరిపూర్ణం, ప్రధాన కార్యదర్శి పి. వెంకటస్వామి, కోశాధికారి బాదం పరమేశ్వర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నవీన్ హౌదేకర్, రాఘవ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.



## మోటార్ ఇన్స్పెక్టర్ పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలి

### లారీ డ్రైవర్ ను హైకోర్టులో హాజరుపరచాలి -హైకోర్టు జడ్జీ ఆదేశం

**అమరావతి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 27**

మైనింగ్ లోడు లారీ డ్రైనర్ ను 5 వేలు లంచం డిమాండ్ చేసి, ఇవ్వలేదని దాడికి పాల్పడిన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పార్వతి మీదా కూడా కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని, అనంతరం ఇన్స్ పెక్టర్ కారు డ్రైవర్ పైన, యంవిఐ పార్వతి సంయుక్త దాడి కేసును దర్యాప్తు చేయాలని ఏపి హైకోర్టు గురువారం విశాఖపట్నం పోలీసులను ఆదేశించింది. మధ్యప్రదేశ్ కు చెందిన లారీ డ్రైవర్, దాడికి గురై, ప్రాణపాయ స్థితిలో బయటపడ్డా డ్రైవర్ ను హైకోర్టు ముందు ఏపి పోలీసులు హాజరుపరిచారు. ఈ కేసును హైకోర్టులో బొడ్డా శేషగిరి, న్యూ ఆంధ్ర మోటార్స్ ట్రక్కర్స్ అసోసియేషన్ తరుపున హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ, రవాణా శాఖ ప్రిన్సిపాల్ కి, పోలీస్ శాఖ డిజిపికి కూడా మైనింగ్ లారీ డ్రైవర్ పై దాడి, హత్యప్రయత్నంపై యంవిఐ పార్వతి, ఆమె కారు డ్రైనర్ పైనా హత్యప్రయత్నం, లంచం డిమాండ్, డ్రైవర్ మొహం భాగంపై చెవి, ముక్కు, గొంతు నులిమి హత్యప్రయత్నం తదితర కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని, పోలీసులు దర్యాప్తు చేయాలని నవ్య ఆంధ్ర మోటార్స్ ట్రక్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి బి. రాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై సమగ్ర దర్యాప్తుకు పోలీసులను ఆదేశించాలని కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ని కూడా



అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. దాడి గురైన మైనింగ్ లారీ డ్రైవర్ కు చట్ట ప్రకారం న్యాయం జరగని పక్షంలో దేశ, రాష్ట్ర వ్యాప్త ఆదోళనకు కూడా వెనకాడబోమని అసోసియేషన్ నాయకులు ప్రభుత్వానికి, సంబంధిత శాఖ ఉన్నాతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

## న్యాయ సదస్సును విజయవంతం చేయండి

### ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు ఎండీ. అజామ్



**అమలాపురం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 27:**

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) తూర్పు గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఆదివారం ఉదయం 10 గంటలకు అమలాపురంలోని కిమ్స్ మెడికల్ కాలేజ్ సి.పద్మనాభ రెడ్డి సెమినార్ హాల్‌లో జిల్లా స్థాయి న్యాయ సదస్సు నిర్వహించనున్నారు. ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు ఎండీ. అజామ్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో "ఆస్తి చట్టాలు - 2018 సవరించిన నిశ్చయాత్మక ఉపశమన చట్టం" అనే ముఖ్యమైన అంశంపై లోతైన చర్చ సాగనుంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తెలంగాణ పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్మన్ జస్టిస్ డాక్టర్ బి. శివశంకర్ రావు, రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ జునైద్ అహ్మద్ మౌలానా హాజరుకానున్నారు. పౌర హక్కుల పరిరక్షణ, ఉచిత న్యాయ సహాయం, సామాజిక న్యాయం లక్ష్యంగా ఏర్పాటవుతున్న ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్. సురేష్ కుమార్, మాజీ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, వి. చంద్రశేఖర రెడ్డి, సీనియర్ న్యాయవాది కుచిమంచి మల్లపరాజు, అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాశి శేషారావు తదితరులు ప్రత్యేక వక్తలుగా పాల్గొని ప్రసంగించనున్నారు. యువ న్యాయవాదులకు ఆస్తి తగాదాల పరిష్కార చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ వేదిక ఎంతగానో దోహదపడుతుందని పేర్కొంటూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, లా విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని ఐఏఎల్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించినట్లు జిల్లా కార్యదర్శి వి. గోపాల రావు తెలిపారు.

## హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై డిగ్రీ కాలేజీ విద్యార్థులకు అవగాహన

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం మండలం మండలం ఎర్రవంతెన వద్ద ఉన్న అమలాపురం డిగ్రీ కళాశాల విద్యార్థులకు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కె.సూరిబాబు, బి.రమేష్ సమక్షం లోహెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దిశా/జనకల్యాణ్ ప్రివెన్షన్ యూనిట్, సహకారంతో ఐఈసీ (ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్) కార్యక్రమంలో భాగంగా అమలాపురం ఏరియా హాస్పిటల్ ఐసీటీసీ కౌన్సిలర్ కె ప్రతాప్ సమక్షంలో డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్య అంశాలపై హెచ్ ఐ వి ఎయిడ్స్ / లైంగిక వ్యాధుల పై అవగాహనా కార్యక్రమం ను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఐవీ ఎలా సంక్రమిస్తుంది,ఎలా సంక్రమించదు, హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ సోకిన వారికి అందుబాటులో ఉన్న చికిత్సా సేవలు, సుఖవ్యాధులు, టీబీ, డ్రగ్స్ వినియోగం, హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు సంబంధించిన ఉచిత సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 1097 టోల్‌ఫ్రీ నంబర్, హెచ్ఐవీ/ఎయిడ్స్



చట్టం--2017, ఏఆర్‌టీ మందుల కేంద్రాలు, సుఖవ్యాధులు, టీబీ, క్యూఆర్ కోడ్ తదితర అంశాలపై వివరించారు. విద్యార్థులకు ఐఈసీ కరపత్రాలను పంపిణీ చెయ్యటం జరిగింది. క్యూఆర్ కోడ్ స్కాన్ తో విద్యార్థులతో సెల్ఫ్ రిస్క్ అస్సెస్మెంట్ ఫ్రొం ను ఫిల్ చేపించటం జరిగింది. ఈ కార్యక్రమంలో దిశా /జనకల్యాణ్ ప్రాజెక్ట్ ,స్టాఫ్ ఏఎన్ఎం కె. వెంకటరమణ పీర్ ఎడ్యుకేటర్ గుర్రాల అమల ఐసీటీసీ కౌన్సిలర్, ది అమలాపురం డిగ్రీ కాలేజీ లెక్చరస్ తదితరులు పాల్గొనటం జరిగింది.

## మంచినీటి బోరుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**పుట్రెల: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 27:**

ఎన్టీఆర్ జిల్లా, విస్సన్నపేట మండలంలోని పుట్రెల ఎస్సీ కాలనీ మూడో వార్డులో తాగునీటి సమస్య పరిష్కారం కోసం తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నూతన బోరుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. బోరు పూర్తయిన తర్వాత కాలనీవాసులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులోకి వస్తుందని త్రాగునీటి సమస్య తీరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.


## అన్న క్యాంటీన్ లో భోజనం చేసిన కేంద్రమంత్రి



**శ్రీకాకుళం జిల్లా : (సిటిజన్ టైమ్స్): ఆగస్టు 27**

కోట బొమ్మాలి మండలం, కొత్తపేటలో జరిగినటువంటి ప్రజా దర్బార్ కార్యక్రమానికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా ఉన్నటువంటి అన్న క్యాంటీన్ ను సందర్శించారు. తొలుత అక్కడ ప్రజలకు ఆయన భోజనం వడ్డించారు. అనంతరం వాళ్లతో కలిసి సామాన్యుడిలా లేటు పట్టుకుని మధ్యాహ్నం భోజనం చేశారు. అందులో భోజనం నాణ్యత , పరిసరాల పరిశుభ్రత పై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

## ఖనిజ అన్వేషణకు కేంద్రం ఆమోదం



**పల్నాడు జిల్లా: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు 27:**

పల్నాడు జిల్లాలో 12 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఐదేళ్లపాటు అరుదైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ సహా కీలక ఖనిజాల ఉనికిని అంచనా వేసేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. దాచేపల్లి మండలంలో హెలికాప్టర్ ద్వారా అతి తక్కువ ఎత్తు నుంచి ప్రత్యేక పరికరం ద్వారా అన్వేషిస్తున్నారు. ఇప్పటికే సున్నపురాయి, ఇనుప ఖనిజం, రాగి, సీసము వంటి ఖనిజాలు ఉన్నట్లు గత నివేదికలో పేర్కొన్నారు. ఈ అన్వేషణ విజయవంతం అయితే పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయి.

## మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించు కోవాలి

### రూరల్ సీఐ కృష్ణయ్య

**బద్వేలు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రశాంతమైన వాతావరణంలో ఓటును వినియోగించుకోవాలని గురువారం బద్వేలు రూరల్ సీఐ ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేసిన శాంతి భద్రతలకు అలాంటి ఇబ్బందులు జరగకుండా ఎదుర్కొనేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నాం అని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్ర నగర్ గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా రెచ్చగొడితే రెచ్చిపోకుండా ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకొని పోలీసులకు సహకరించాలని తెలిపారు.



# జిల్లా పోలీస్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

**వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్ను నాయక్ ఎన్నిక**




**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 27**

నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగింది. జిల్లా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హెడ్ కానిస్టేబుల్ కె. చిన్ను నాయక్, ఉపాధ్యక్షుడిగా సీఐ వై. అశోక్ రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఎస్పీ శు భాకాంక్షలు తెలిపారు. పోలీస్ అసోసియేషన్ అనేది కేవలం ఒక సంఘం మాత్రమే కాదని, అది పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమం, పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధి మరియు సేవానిరతిని బలోపేతం చేసే కీలక వేదిక అని ఎస్పీ పేర్కొన్నారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించి అధికారులకు, సిబ్బందికి మధ్య వారధిగా ఉంటూ అసోసియేషన్ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

నూతన కార్యవర్గం వివరాలు:

- అధ్యక్షుడు: కె. చిన్ను నాయక్ (హెడ్ కానిస్టేబుల్)
- ఉపాధ్యక్షులు: వై. అశోక్ రెడ్డి (సర్కిల్ ఇన్స్పెక్టర్), ఎం. రాములు (సబ్ ఇన్స్పెక్టర్)
- కార్యదర్శి: జి. మాధవరెడ్డి (సబ్ ఇన్స్పెక్టర్)
- జాయింట్ సెక్రటరీ: ఎం. రమేష్ (కానిస్టేబుల్)
- ఆర్గనైజింగ్ సెక్రటరీ: ఎస్. రాములు (కానిస్టేబుల్)
- ట్రెజరర్: జి. శ్రీనివాసులు (కానిస్టేబుల్)
- ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు: రవివర్మ, నాగరాజు, శారద, శ్రీనయ్య, కిషోర్ రెడ్డి, హరిలాల్

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శంకర్, ఏవో కృష్ణయ్య, అసోసియేషన్ ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఆది గణపతి అయినవిల్లి గణపతి సన్నిధిలో వినాయక చవితి మహోత్సవములు - 2026

**వినాయక చవితి ఉత్సవాల పందిరి రాట మహోత్సవం**



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా శ్రావణ శుక్ల చతుర్దశి ఆగస్టు 27 గురువారం ఉదయం 07:29 నిమిషాలకు పందిరి రాట ముహూర్త కార్యక్రమం స్థానిక శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా వైభవోపేతంగా నిర్వహించబడింది. అనంతరం, వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ విళ్ళ సూర్య నారాయణ మరియు సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**పి గన్నవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

విజయవాడ వెలగపూడిలోని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన అంశాలపై కమిటీ సభ్యులతో కలిసి చర్చించారు. ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఛైర్మన్ తో పాటు ఇతర సభ్యులు కూడా పాల్గొన్నారు.



# ఇక్కడే చదువు... ఇక్కడే ఉద్యోగం

## -నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించాలన్నదే నా ఆశయం -ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కందుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించగా శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మాట ఇచ్చినట్లుగా... కందుకూరు నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాను అని అన్నారు. రామాయపట్నం పోర్టు, లక్ష కోట్ల పెట్టుబడితో రాబోతున్న బిపిసిఎల్, 50వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఇండోసోల్, ఇంకా జిందాల్ స్టీల్ వంటి కంపెనీలు త్వరలో కార్యకలాపాలు ప్రారంభిస్తాయి అని అన్నారు. ఒక్కో కంపెనీ ద్వారా వేలాది ఉద్యోగాలు వస్తాయి. మన దగ్గర చదువుకున్న వారికి, ఇక్కడే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి అని అన్నారు. దేశంలో కొత్తగా ఏర్పాటు అవుతున్న పరిశ్రమల్లో, 27 శాతం మన రాష్ట్రానికే వస్తున్నాయి. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నాయకులు లోకేష్ కృషితోనే సాధ్యమవుతోంది. నిరుద్యోగులకు భరోసా కల్పించి, వారి భవిష్యత్తును బంగారుమయం చేసేలా వారు కష్టపడుతున్నారు అని అన్నారు. ప్రతి కుటుంబంలో చదువుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తల్లిదండ్రుల కలలు




నెరవేర్చేలా విద్యార్థులు, యువత కష్టపడాలి. ఒక లక్ష్యంతో చదివి, అనుకున్నది సాధించాలి అని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలలో 3 నెలలపాటు శిక్షణ పొందండి. కంపెనీలు కోరుకుంటున్నట్లుగా కోర్సులలో శిక్షణ ఇస్తారు. శిక్షణలో చేరేవారికి, మండల కేంద్రాల నుంచి ఇక్కడికి నేరుగా బస్సు వసతి ఏర్పాటు చేస్తాను అని అన్నారు. సుమారు 300 మందికి పైగా నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనగా 20కి పైగా కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ రియాజుద్దీన్, ఐటిఐ కాలేజీ



ప్రిన్సిపల్ ఎంవీ నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆచార్య, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ సలాం, పట్టణ బిజెపి అధ్యక్షుడు కళ్యాణ్, టిడిపి నాయకులు ముప్పవరపు వేణు, నల్లూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

**'ఇంటింటికి తెలుగుదేశం'లో మంత్రి గొట్టిపాటి. రవికుమార్**

**ఎస్.ఎల్. గుడిపాడులో పలు అభివృద్ధి పనుల ప్రారంభం**





**అద్దంకి, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

అద్దంకి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బల్లికురవ మండలం, ఎస్.ఎల్. గుడిపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం గడచిన రెండేళ్లలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానికుల నుంచి సమస్యలను ఆరా తీస్తూ.. వారి సలహాలు, సూచనలు స్వీకరించారు.

**రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు..**

బల్లికురవ మండల పర్యటనలో భాగంగా గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును, డీఎస్వీ ఫౌండేషన్, అసిస్ట్ సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గుడిపాడుతో పాటు నూజెళ్ళపల్లి, సోమవరప్పాడు గ్రామాల్లోనూ డీఎస్వీ ఫౌండేషన్, అసిస్ట్ సహకారంతో త్వరలోనే వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి స్థానికులతో నేరుగా ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ పర్యటనలో ఎలాంటి లోపాలు ఉండకూడదు - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు





**ఒంగోలు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం ఒంగోలు నగర పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు చేయటంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజు, ఒంగోలు, కనిగిరి, గోపాలపురం ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన రావు, ఉగ్ర నరసింహారెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, తదితరులతో కలిసి వీటిని పరిశీలించారు. ముందుగా కిమ్స్ ఆసుపత్రి జంక్షన్ లో సర్వీస్ రోడ్డు వెంట చేపట్టిన సుందరీకరణ పనులను పరిశీలించి, నగరానికి చెందిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను లోకేష్ ఆవిష్కరిస్తారు. అనంతరం రంగారాయుడు చెరువు వద్ద అమృత్ - 2 పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్ ఆవిష్కరిస్తారు. ఈ దృష్ట్యా సంబంధిత పనులను పూర్తి చేయడం, మంత్రి లోకేష్ చేత వీటిని ఆవిష్కరించడం లక్ష్యంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ తో పాటు ప్రజాప్రతినిధులు వీటిని పరిశీలించారు. కాగా, వీటికి ముందుగా నాగులప్పలపాడు మండలం మద్దిరాలపాడు వద్ద ర్యాడిసన్ హోటల్ నిర్మాణానికి భూమి పూజ, చివర్లో ఒంగోలులో కార్యకర్తల సమావేశంలో నూ మంత్రి లోకేష్ పాల్గొంటారని ఆయన కార్యాలయం తెలిపింది. అధికారిక కార్యక్రమాల ఏర్పాట్ల పరిశీలనలో ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, మునిసిపల్ ఇంజనీర్ యేసయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇద్దరు వాహనదారులకు పది రోజులు జైలు శిక్ష - ఒంగోలు ట్రాఫిక్ సిఐ సిహెచ్ హాజరత్తయ్య

**ఒంగోలు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురిలో నలుగురికి జరిమానా, మరో ఇద్దరికి జైలు శిక్ష కోర్టు విధించినట్లు ఒంగోలు ట్రాఫిక్ సిఐ సి.హెచ్. హాజరత్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన తనిఖీలలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురుని కోర్టులో హాజరుపరచగా నలుగురికి ఒక్కొక్కరికి రూ. 10,000/- లు చొప్పున జరిమానా, మరో ఇద్దరికి ఒక్కొక్కరికి పది రోజులు చొప్పున జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని హెల్మెట్ లేకుండా, సీటు బెల్టు ధరించకుండా వాహనాలు నడపరాదని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని సూచించారు.




# తవ్వారు..మరిచారు..!

**అధికారులు పట్టించుకోవాలని ప్రజల డిమాండ్**





**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

పట్టణంలో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఓ సిమెంట్ రోడ్డు దర్శనమిస్తోంది. స్థానిక 18 వ బ్లాక్ లోని గీతాంజలి స్కూల్ రోడ్డు లో మంచినీటి పైపులైన్ కోసం రోడ్డుకు అడ్డంగా తవ్వకం చేపట్టిన కాంట్రాక్టర్లు, పైపులు వేసిన తర్వాత తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన సిమెంట్ రోడ్డును ఇష్టారాజ్యంగా తవ్వేసి, పనులు పూర్తయ్యాక యధావిధిగా పూడ్చకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీంతో రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడి, అది ప్రమాదాలకు నిలయంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు బోల్తా పడుతున్న ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆటోలు, కార్లు కూడా ఈ గుంత దాటాలంటే ఇబ్బంది పడుతున్నాయి.సాధారణంగా ఏదైనా అభివృద్ధి పనుల కోసం రోడ్డు తవ్వితే, పనులు పూర్తయిన వెంటనే తిరిగి రోడ్డును యధాతథంగా వేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖదే. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. పనులు అయిపోయాయి కదా అని చేతులు దులుపుకుంటున్నారు. దీనివల్ల ప్రభుత్వ సొమ్ము వృధా కావడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలుగుతోంది.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి, తవ్వి వదిలేసిన సిమెంట్ రోడ్డును వెంటనే మరమ్మతు చేసి, వాహనాల రాకపోకలకు అనుకూలంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ ఐడిని పొందాలి

**మండల వ్యవసాయాధికారి పి మధుబాబు**




**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 27**

పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులు రైతు సేవా కేంద్రం అధికారుల ద్వారా ఫార్మర్ ఐడి ని పొందాలని అలాగే పంటలు వేసిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బంది ని సంప్రదించి పంట నమోదు మరియు పంటల భీమా పథకాలను ఉపయోగించుకోవలెనని మండల వ్యవసాయ అధికారి పి. మధుబాబు తెలిపారు. గురువారం మండలంలోని కంభంపాడు , చింతలపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులతో కలిసి వరి నారు మడి పరిశీలించి పాటించాల్సిన మెలుకువలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో యూరియా మరియు డిఏపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఉపయోగించుకోవాలని అన్నారు ఖరీఫ్ సీజన్లో ఎల్నినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా ఉంటాయని తెలిపారు పంటలు సాగులో ఉన్న అన్ని గ్రామాల పరిధిలోని రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచి, ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# అనిపిస్తున్న కృతి శెట్టి లేటెస్ట్ పిక్స్.. వీకెండ్ లుక్ చూస్తే ఫిదా కావాల్సిందే!

టాలీవుడ్ లో ఉప్పెన సినిమాలో బెబమ్మగా పరిచయమై తొలి చిత్రంతోనే సౌత్ ఇండియా వ్యాప్తంగా కుర్రకారు గుండెల్లో స్థానం సంపాదించుకుంది కృతి శెట్టి. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, మలయాళ భాషల్లోనూ వరుస సినిమాలు చేస్తూ నేటితరం క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతోంది. తాజాగా ఈ భామ 'వీకెండ్ వైబ్స్' అంటూ సోషల్ మీడియాలో షేర్ చేసిన క్యాజువల్, క్లీన్-గర్ల్ లౌంజ్‌వేర్ ఫొటోషూట్ పిక్స్ ఇప్పుడు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.



లైమ్ గ్రీన్ దుస్తుల్లో ఆకట్టుకుంటున్న రాయ్ లక్ష్మి

**సింపుల్ అండ్ స్టైలిష్ లౌంజ్‌వేర్ లుక్:**

తాజా ఫొటోషూట్‌లో కృతి శెట్టి చాలా సింపుల్‌గా, అంతే స్టైలిష్‌గా కనిపిస్తోంది. రిబ్బెడ్ నిట్ క్రాప్డ్ ట్యాంక్ టాప్, దానికి మ్యాచింగ్ వైడ్-లెగ్ నిట్ ప్యాంట్స్ ధరించి ఇంట్లో ప్రశాంతంగా గడిపే క్యాజువల్ వీకెండ్ లుక్‌ను ప్రదర్శించింది. ఇక సన్-హైలైటెడ్ బ్రౌన్ హెయిర్ వేవ్స్ భుజాలపై పడుతుండగా, న్యూడ్ లిప్‌స్టిక్, లైట్ మేకప్‌తో మినిమల్ హై-ఫ్యాషన్ స్ట్రీట్ స్టైల్‌ను ఎంతో పర్‌ఫెక్ట్‌గా మేనేజ్ చేసి అభిమానులను మైమరపింపజేస్తోంది.



**'ఉప్పెన' నుంచి 'మనమే' వరకు బిజీ బిజీ:**

తన డెబ్యూ మూవీ 'ఉప్పెన' నటనకు గాను ఫిల్మ్‌ఫేర్, సైమా వంటి ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్న కృతి, ఆ తర్వాత వరుస ప్రాజెక్టులతో బిజీగా మారింది. ఇటీవలే శర్వానంద్‌తో కలిసి నటించిన 'మనమే' చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇక నటనతో పాటు అందంతోనూ మెప్పిస్తున్న ఈ కన్నడ కుట్టికి దక్షిణాదిలో వరుస అవకాశాలు తలుపు తడుతున్నాయి.

**2040 కాన్సెప్ట్‌తో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ':**

తాజాగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, ఎస్. జె. సూర్యలతో కలిసి ఆమె నటించిన సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' థియేటర్లలోకి వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇక 2040 నాటి టెక్నాలజీ ప్రపంచం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో కృతి 'ధీమా' అనే ఆన్‌లైన్ ఇన్‌ఫ్లుయెన్సర్ పాత్రలో కనిపించింది. తన నిజ జీవితానికి దగ్గరగా ఉన్న ఈ పాత్రలో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. వెండితెరపై నటనతో అలరించడమే కాకుండా, సోషల్ మీడియాలో తన గ్లామరస్ అండ్ స్టైలిష్ పిక్స్‌తో నిరంతరం అభిమానులకు టచ్‌లో ఉంటోంది కృతి శెట్టి. తక్కువ వయసులోనే అవార్డులు, హిట్లు సాధిస్తూ టాలెంట్, గ్లామర్ రెండింటినీ సమంగా బ్యాలెన్స్ చేస్తున్న ఈ క్యూట్ బ్యూటీ.. రాబోయే రోజుల్లో సౌత్ ఇండస్ట్రీలో మరిన్ని సంచలనాలు సృష్టించడం ఖాయం..



అందమైన ఐవరీ రంగు చీరలో అద్భుతంగా కనిపిస్తున్న జాన్వీ కపూర్

## భారత్ విజయానికి అడ్డుగోడలా దినుష..

# రెండో టెస్టు డ్రా.. గిల్ సేనదే సిరీస్

- ఫాలో ఆన్ ఆడినా అద్భుత పోరాటంతో రెండో టెస్టును డ్రా చేసుకున్న శ్రీలంక
- అజేయ సెంచరీతో జట్టును ఆదుకున్న యువ కెరటం సోనల్ దినుష
- తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్, ధ్రువ్ జురెల్ శతకాలతో భారత్ భారీ స్కోరు
- బౌలర్లకు సహకరించని పిచ్‌పై లంక బ్యాటర్ల అద్వితీయ నిలకడ
- ఈ సిరీస్‌లో మూడు సెంచరీలతో దినుష, 16 వికెట్లతో మానవ్ సుతార్ టాప్ పెర్ఫార్మర్లు



శ్రీలంక యువ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన ప్రతిఘటనతో భారత్ విజయానికి అడ్డుగోడలా నిలిచాడు. ఓటమి అంచున నిలిచిన జట్టును తన వీరోచిత సెంచరీతో ఆదుకుని, రెండో టెస్టును డ్రాగా ముగించడంలో కీలక పాత్ర పోషించాడు. ఫాలో ఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన శ్రీలంక, ఓటమి ఖాయమనుకున్న దశలో దినుష (133 నాటౌట్) అసాధారణ పోరాటపటిమతో భారత్ కు సవాలుగా నిలిచాడు. అతనికి ఇతర బ్యాటర్లు చక్కటి సహకారం అందించడంతో, కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ఆశలు గల్లంతయ్యాయి. మ్యాచ్ చివరి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. అప్పటికే లంక ఆధిక్యం 216 పరుగులకు చేరింది. ఇవాళ ఆటకు చివరి రోజు కాగా, టీమిండియా గెలిచే అవకాశం లేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అద్భుతమైన ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను కాపాడుకున్న సోనల్ దినుషను భారత ఆటగాళ్లు, కోచ్ గౌతమ్ గంభీర్ ప్రత్యేకంగా అభినందించారు.

**ఫాలో ఆన్‌లో లంక పోరాటం**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 503 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ (117), ధ్రువ్ జురెల్ (115) సెంచరీలతో కదం తొక్కగా, యశస్వి జైస్వాల్ (45), శుభ్‌మన్ గిల్ (50), రిషభ్ పంత్ (63) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక 290 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు చేతులెత్తేయగా, సోనల్ దినుష (103), పసిందు సూరియబండార (80) మాత్రమే రాణించారు. దీంతో భారత్‌కు 213 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. భారీ ఆధిక్యంతో శ్రీలంకను ఫాలో ఆన్‌కు ఆహ్వానించిన భారత్‌కు ఆతిథ్య జట్టు ఊహించని షాక్ ఇచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో లంక బ్యాటర్లు అద్భుతమైన పోరాటాన్ని ప్రదర్శించారు. పసిందు సూరియబండార (92), కమిందు మెండిస్ (55) రాణించగా, సోనల్ దినుష మరోసారి శతకంతో కదంతొక్కాడు. ఈ సిరీస్‌లో అతనికి ఇది మూడో సెంచరీ కావడం విశేషం. దినుషకు కేశర నువంత (46) తోడవడంతో లంక ఓటమి నుంచి గట్టెక్కింది. లంక టెయిలెండర్లు దాదాపు 90 ఓవర్ల పాటు క్రీజులో నిలబడి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలించిన పిచ్‌పై భారత బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. భారత బౌలర్లలో ఈ సిరీస్ మొత్తం మీద మానవ్ సుతార్ 16 వికెట్లతో అగ్రస్థానంలో నిలవగా, లంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో 10 వికెట్లు పడగొట్టాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది.

# తండ్రుల బాటలోనే.. భారత అండర్-19 జట్టులోకి సెహ్వాగ్, ద్రవిడ్ కుమారులు

- ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఆర్యవీర్ సెహ్వాగ్ ఎంపిక
- అన్వయ్ ద్రవిడ్‌కు భారత అండర్-19 జట్టులో చోటు
- సెప్టెంబర్ 18న తొలి వన్డే
- 3 వన్డేలకు రాజ్‌కోట్ ఆతిథ్యం
- వన్డే కెప్టెన్‌గా లక్ష్య రైచందాని ఎంపిక





భారత క్రికెట్ దిగ్గజాలు విరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ వారసులు మరోసారి వార్తల్లో నిలిచారు. ఆస్ట్రేలియా అండర్-19తో జరగనున్న సిరీస్‌కు భారత జట్టులో ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్‌కు చోటు దక్కింది. భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్ల మధ్య మూడు వన్డేలు జరగనున్నాయి. సెప్టెంబర్ 18, 21, 23 తేదీల్లో రాజ్‌కోట్‌లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత నాలుగు రోజుల మ్యాచ్‌లు రెండు ఉంటాయి. సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు రాజ్‌కోట్‌లో తొలి మ్యాచ్ జరుగుతుంది. అక్టోబర్ 5 నుంచి 8 వరకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం 'బి' గ్రౌండ్‌లో రెండో మ్యాచ్ ఉంటుంది. వన్డే జట్టుకు లక్ష్య రైచందాని కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. యశ్‌వర్ధన్ చౌహాన్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. రెడ్‌బాల్ మ్యాచ్‌లకు చౌహాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రైచందాని వైస్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ ప్రస్తుతం ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్‌కు ఆడుతున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడాడు. అన్వయ్ ద్రవిడ్ ఇటీవల శ్రీలంక పర్యటనలో రెండు వన్డేలు ఆడి 101 పరుగులు చేశాడు. వన్డే జట్టులో ఆర్యవీర్, అన్వయ్‌తో పాటు మనల్ చౌహాన్, చిగురుపాటి వెంకటకు చోటు లభించింది. సాగర్ విర్క్, అన్మోల్‌జీత్ సింగ్, ఇషాన్ సూద్ వన్డే జట్టులో లేరు.

# టీ20లో గోల్డెన్ హ్యాట్రిక్.. తొలి మూడు బంతులకు మూడు వికెట్లు

- తొలి 3 బంతుల్లోనే 3 వికెట్లతో గోల్డెన్ హాట్రిక్
- ముగ్గురు బ్యాటర్లు డకౌట్
- దీబన్ లింగేశ్ టీఎన్‌పీఎల్‌లో చరిత్ర
- 99 పరుగులకే ట్రిచీ గ్రాండ్ చోళాస్ ఆలౌట్
- ఫైనల్లో తిరుప్పూర్ తమిళన్స్-మదురై పాంథర్స్ ఢీ



తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్)లో బుధవారం అద్భుతం చోటుచేసుకుంది. కేవలం మూడు బంతుల్లోనే మూడు వికెట్లు పడిపోయాయి. పైగా ముగ్గురు బ్యాటర్లు ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరారు. కోవై కింగ్స్‌తో క్వాలిఫయర్-2లో ట్రిచీ గ్రాండ్ చోళాస్ బ్యాటింగ్‌లో ఈ షాకింగ్ ఘటన జరిగింది. 184 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ట్రిచీకి కె. దీబన్ లింగేశ్ తొలి ఓవర్లోనే చుక్కలు చూపించాడు. మొదటి మూడు బంతుల్లోనే కె. రాజ్‌కుమార్, ఎస్. శ్యామ్ సుందర్, జగన్నాథన్ కౌశిక్‌లను ఔట్ చేశాడు. ముగ్గురూ డకౌట్ కావడంతో ట్రిచీ ఆరంభంలోనే కుప్పకూలింది. ఈ ప్రదర్శనతో దీబన్ లింగేశ్ టీఎన్‌పీఎల్ చరిత్రలో అరుదైన రికార్డు సృష్టించాడు. లీగ్‌లో గోల్డెన్ హ్యాట్రిక్ సాధించిన తొలి బౌలర్‌గా నిలిచాడు. అంటే వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు తీయడంతో పాటు, ఆ ముగ్గురు బ్యాటర్లు కూడా సున్నాకే వెనుదిరిగారు. ట్రిచీ ఇన్నింగ్స్‌లో మరో రెండు డకౌట్లు కూడా నమోదయ్యాయి. మణిమారన్ సిద్ధార్థ్ జాఫర్ జమాల్‌ను ఔట్ చేశాడు.

ఆ తర్వాత ఆర్. దివాకర్ అథిసయరాజ్ డేవిడ్‌సన్‌ను పెవిలియన్‌కు పంపాడు. చివరికి ట్రిచీ 99 పరుగులకే ఆలౌటైంది. సిద్ధార్థ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఐడ్రీమ్ తిరుప్పూర్ తమిళన్స్ టీఎన్‌పీఎల్ 2026 ఫైనల్‌కు చేరింది. ఆగస్టు 28న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో మదురై పాంథర్స్‌తో టైటిల్ పోరులో తలపడనుంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776